www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 26 | ఆదివారం 25 - 05 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## జాబ్ మేళా కి నిరుద్యోగ యువతని తరలించిన నవీన్ రాథోడ్



3



### పాక్ హైకమిషన్ ఉద్యోగితో
## జ్యోతికి సంబంధాలు

తొలిఅడుగు, ఇంటర్నెట్ డెస్క్: భారతదేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. యూట్యూబ్ వీడియోల చిత్రీకరణ పేరుతో దేశంలోని

2లో..

### సముద్రంలో మునిగిన
## రెండు ఓడలు



**427 మంది రోహింగ్యాలు జలసమాధి?**

తొలిఅడుగు, డెస్క్ : మయన్మార్ తీర ప్రాంతంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు ఓడలు మునిగిపోయాయి. ఈ ఘోర దుర్ఘటనల్లో సుమారు 427 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఐక్యరాజ్య

2లో..



# పార్ట్-బీ మెట్రోకు డీపీఆర్ సిద్ధం

- రాష్ట్ర సర్కారుకు చేరిన సమగ్ర నివేదిక.. ఈ నెల 8న పంపించిన హెచ్ఏఎంఎల్
- క్యాబినెట్ ఆమోదం తర్వాత కేంద్రానికి 3 కారిడార్లకు 19,579కోట్ల వ్యయం!

తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్ర రాజధానిలోని మెట్రో రెండో దశలో భాగంగా పార్ట్-బీ కింద ప్రతిపాదించిన నార్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. ఆయా కారిడార్లలో సుమారు 6 నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని అంశాలపై అధ్యయనం చేసిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు డీపీఆర్‌ను తయారు చేశారు. ఇటీవల జరిగిన బోర్డు మీటింగ్‌లో మరోసారి అన్ని అంశాలనూ కూలంకూషంగా చర్చించి, ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత కేంద్రానికి అందజేయాలని యోచిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరం

2లో..

### ప్రధానితో తెలంగాణ
## సీఎం భేటీ




- హైదరాబాద్ మెట్రో విస్తరణకు వెంటనే అనుమతించాలని విజ్ఞప్తి

తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులపై ఆయన ప్రధానికి వినతి పత్రాలు అందజేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో భాగంగా హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణకు సంబంధించిన అనుమతులను వీలైనంత

2లో..

# ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు!



- నకిలీ వైద్యుడి కేసులో వెలుగుచూస్తున్న దారుణాలు
- సూర్యాపేట జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల్లో కొత్త కోణం
- 3 రోజుల క్రితం లింగ నిర్ధారణ పరీక్షతో గర్భిణీ మృతి
- తన ఇంట్లోనే స్కానింగ్ పరీక్ష చేసిన నకిలీ డాక్టర్

**కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాసులకు కక్కుర్తి పడి పదరాని పాట్లు పడుతున్నారు.**

తొలిఅడుగు, ప్రధాన ప్రతినిధి : సూర్యాపేట జిల్లా నకిరేకల్‌లో నకిలీ వైద్యుడు స్కానింగ్ చేస్తున్న కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. ఇటీవల ఈ నకిలీ వైద్యుడు చేసిన లింగ నిర్ధారణ పరీక్షతో గర్భిణీకి గర్భస్రావమై మృతి చెందింది. దీంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. విచారణలో ఈ ఫేక్ డాక్టర్ తన ఇంట్లోనే అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసిన చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ నల్గొండ,నార్కట్‌పల్లి ప్రాంతాలకు చెందిన గర్భిణులకు ఇదే రీతిన నకిరేకల్‌లో చట్టవిరుద్ధంగా పరీక్షలు చేసిన అనంతరం అక్కడ గర్భస్రావాలు జరగడంతో బంధువుల ఫిర్యాదుతో నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుడు సూర్యాపేట, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల తదితర



2లో..

### భారత్‌లో చొరబాటుకు
## పాకిస్థానీ యత్నం



తొలిఅడుగు, న్యూఢిల్లీ : భారత భూభాగంలోకి చొరబడేందుకు యత్నించిన పాకిస్థాన్ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళాలు కాల్చిచంపాయి. శుక్రవారం అర్ధరాత్రి (అంటే తెల్లవారితే శనివారం) గుజరాత్ లోని బనస్కాంత్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసు

2లో..

## దేశంలో కొవిడ్ కొత్త వేరియంట్స్ కలకలం..!



తొలిఅడుగు, న్యూఢిల్లీ : దేశంలో కరోనా వైరస్ మరోసారి పంజా విసురుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పలుచోట్ల కొవిడ్ కొత్త వేరియంట్‌లను అధికారులు గుర్తిస్తున్నారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న వేళ కొత్త వేరియంట్‌లు వెలుగుచూస్తుండటం కలకలం రేపుతోంది.

2లో..

### హైదరాబాద్‌లో
## స్లీపర్ సెల్స్ ఉన్నాయా?




2లో..

తొలిఅడుగు, హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం, తెలంగాణ రాష్ట్ర రాజధాని, దేశంలోని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో

## పోలవరం డెడ్ స్టోరేజీ నీటి ఎత్తిపోతలపై తెలంగాణ అభ్యంతరం

**గోదావరి బోర్డు, పీపీఏకు తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ లేఖ**



2లో..

తొలిఅడుగు, హైదరాబాద్ : పోలవరం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ నుంచి నీటి ఎత్తిపోతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్న వార్తలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)తో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి లేఖ రాశారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. కేంద్ర

# పాక్ హైకమిషన్ ఉద్యోగితో జ్యోతికి సంబంధాలు

మొదటిపేజీ తరువాయి

పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించగా, గతంలో పూరీ జగన్నాథ ఆలయంతో పాటు ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని కూడా సందర్శించినట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా, పూరీ ఆలయంపై డ్రోన్ ఎగరవేయడం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. అధికార వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, 2024లో జ్యోతి మల్హోత్రా పూరీకి చెందిన మరో యూట్యూబర్‌తో కలిసి శ్రీక్షేత్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆమె ఆలయ పరిసరాల్లో డ్రోన్‌ను ఎగురవేసినట్లు అధికారులు గుర్తించారు. శ్రీక్షేత్రంపై ఉగ్రవాదుల దృష్టి ఉందంటూ ఇటీవల కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలయంపైకి డ్రోన్‌ను ఎందుకు పంపారు, దాని ద్వారా ఎలాంటి దృశ్యాలను చిత్రీకరించారు అనే కోణంలో అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గత సంవత్సరం ఏప్రిల్‌లో జ్యోతి మల్హోత్రా ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని సందర్శించినట్లు మధ్యప్రదేశ్ పోలీసులు తెలిపారు. అయితే, అక్కడి విచారణలో ఇప్పటివరకు ఎలాంటి నేరారోపణలు నిర్ధారణ కాలేదని, ఆమె ఏయే ప్రాంతాలకు వెళ్లింది, ఎక్కడ బస చేసింది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు.

# సముద్రంలో మునిగిన రెండు ఓడలు

మొదటిపేజీ తరువాయి

సమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వార్త నిజమైతే, ఇటీవలి కాలంలో సముద్రంలో జరిగిన అతి పెద్ద విషాదాల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని ఐరాస పేర్కొంది. ఐక్యరాజ్య సమితి అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మే 9వ తేదీన జరిగిన మొదటి ప్రమాదంలో ఒక నౌక మునిగిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న 267 మందిలో కేవలం 66 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడి ఉంటారని తెలిపింది. మిగిలిన వారు గల్లంతయ్యారు. ఆ తర్వాత మే 10వ తేదీన మరో నౌక కూడా ఇదే విధంగా ప్రమాదానికి గురైంది. ఈ రెండో నౌకలో ఉన్న వారిలో 21 మంది మాత్రమే సురక్షితంగా ఒడ్డుకు చేరారని సమాచారం. ఈ రెండు ఘటనల్లో కలిపి మొత్తం 427 మంది మరణించి ఉండవచ్చని ఐరాస అంచనా వేస్తోంది. ఈ ప్రమాదాలకు గల కచ్చితమైన కారణాలపై ఐరాసకు అనుబంధంగా పనిచేస్తున్న శరణార్థి విభాగం విశ్లేషణ జరుపుతున్నట్లు సమాచారం. మయన్మార్‌లో నివసించే రోహింగ్యాలు అనేక సంవత్సరాలుగా వివక్షకు, హింసకు గురవుతున్నారు. 2017లో మయన్మార్ సైన్యం చేపట్టిన కఠిన చర్యల కారణంగా లక్షలాది మంది రోహింగ్యాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అయితే, గత ఏడాది మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు జరిగిన అనంతరం, రోహింగ్యాలపై దాడులు, అణచివేత మరింత పెరిగాయని వార్తలు వస్తున్నాయి. దీంతో, బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో ఇప్పటికే కిక్కిరిసిపోయిన జనాభా, అక్కడి దుర్భర పరిస్థితుల కారణంగా అనేకమంది రోహింగ్యాలు ఇతర దేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే, వారు ఏజెంట్ల మాటలు నమ్మి, ప్రమాదకరమైన సముద్ర మార్గాల ద్వారా ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలకు చేరుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ప్రయాణాల్లోనే తరచూ ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

# భారత్‌లో చొరబాటుకు పాకిస్థానీ యత్నం

మొదటిపేజీ తరువాయి



కుంది. ఈ విషయాన్ని భద్రతా బలగాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సరిహద్దును దాటి కంచె వైపు వస్తున్న ఓ పాకిస్థాన్ వ్యక్తిని భారత జవాన్‌లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై అతడిని నిలువరించేందుకు ప్రయత్నించారు. అక్కడే ఆగిపోవాలని హెచ్చరించారు. అయినా అతడు లెక్కచేయకుండా ముందుకు రావడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి సరిహద్దుల్లో భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలు తీశారు. అందుకు ప్రతిగా భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. దీన్ని సహించని పాక్ సైన్యం మనపై ఎదురుదాడికి పాల్పడి భారత బలగాల చేతిలో చావుదెబ్బ తిన్నది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది

# ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు!


మొదటిపేజీ తరువాయి



ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా గర్భిణీలను రప్పించుకుని ఇక్కడ చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. చట్టవిరుద్ధంగా స్కానింగ్ కేంద్రం నిర్వహిస్తున్న ఈ వ్యక్తి గతంలో స్థానికంగా ఉండే ప్రైవేట్ వైద్యశాలలో కాంపౌం డర్ పనిచేసి స్కానింగ్ మెలకువలు నేర్చుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన ఆసుపత్రి యాజమాన్యం అతడిని దూరం పెట్ట డంతో ఏకంగా ఇంట్లోనే స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసి ఈ దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీని ద్వారా ఎంతో మంది దగ్గర డబ్బులు దోచుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు

# దేశంలో కొవిడ్ కొత్త వేరియంట్స్ కలకలం..!

మొదటిపేజీ తరువాయి



భారత్‌లో కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 లను గుర్తించినట్లు ఇండియన్ సార్స్–కోవ్–2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కేసు ఏప్రిల్‌లో వెలుగుచూడగా.. ఎల్ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులను ఈ నెలలో గుర్తించినట్లు కన్సార్టియం తెలిపింది. ఆ కేసులు తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కొవిడ్ విస్తృతి నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. అయితే ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ వాటి తీవ్రత తక్కువేనని కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తోపాటు చైనాలోనూ కొవిడ్–19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు. ఢిల్లీలో కేసులు పెరుగుతుండటంతో అక్కడి బీజేపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. అయితే ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇప్పటికే స్పష్టంచేసింది.

# పోలవరం డెడ్ స్టోరేజీ నీటి ఎత్తిపోతలపై తెలంగాణ అభ్యంతరం

మొదటిపేజీ తరువాయి

జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును చేపట్టాలని చూస్తోందని తెలంగాణ తన లేఖలో ఆరోపించింది. ఈ చర్య వల్ల గోదావరి డెల్టా ఆయకట్టు ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా, పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తోడి వాడుకోవడం అనేది ఎంతమాత్రం సరికాదని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న ప్రతి నీటిపారుదల ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు తెలుపుతోందని, అలాంటిది ఇప్పుడు ఏపీ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజసమని ఈఎన్‌సీ తన లేఖలో ప్రశ్నించారు. డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం అనేది సీడబ్ల్యూసీ గతంలో జారీ చేసిన అనుమతులకు కూడా పూర్తిగా విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విషయంలో కేంద్ర జల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయకుండా నిరోధించాలని తెలంగాణ డిమాండ్ చేసింది. పోలవరం నుంచి డెడ్ స్టోరేజీ నీటిని ఎత్తిపోసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా చూడాలని కోరింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జల సంఘం గతంలో ఇచ్చిన అనుమతులకు కూడా ఈ ప్రతిపాదన వ్యతిరేకంగా ఉందని ఆయన తన లేఖలో పునరుద్ఘాటించారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకుని, ఈ వివాదాస్పద ప్రతిపాదనపై ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగకుండా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# పార్ట్–బీ మెట్రోకు డీపీఆర్ సిద్ధం

మొదటిపేజీ తరువాయి

నలుమూలలకూ మెట్రో రైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా తొలుత నాగోల్–ఎయిర్‌పోర్టు (కారిడార్–4) 36.8 కిలోమీటర్లు, రాయ దుర్గ్– కోకాపేట్ (కారిడార్–5) 11.6 కిలోమీటర్లు, ఎంజీబీఎస–చాంద్రాయణగుట్ట (కారిడార్–6) 7.5 కిలోమీటర్లు, మియాపూర్–పటాన్‌చెరు (కారిడార్–7) 13.4 కిలోమీటర్లు, ఎల్‌బీనగర్– హయత్‌నగర్(కారిడార్–8) 7.1 కిలోమీటర్ల కారిడార్లను ప్రతిపాదించారు. కిలోమీటరుకు సుమారు రూ.318 కోట్ల అంచనా వ్యయంతో రూ.24,269 కోట్లను కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా (50:50) పద్ధతిన పనులు చేపట్టాలని నిర్ణయించారు. రెండో దశ విస్తరణలో భాగంగా తొలుత 5 కారిడార్లను మాత్రమే ప్రతిపాదించి డీపీఆర్‌లు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం.. మెట్రో రైల్ అధికారులను ఆదేశించింది. అయితే నగరానికి ఉత్తరం వైపునకు కూడా మెట్రో రైలును తీసుకురావాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దీంతో ఫేజ్–2 కింద తొలుత ప్రతిపాదించిన 5 కారిడార్ల డీపీఆర్‌ను పార్ట్–ఏగా తయారు చేయాలని, పార్ట్–బీ కింద జేబీఎస–మేడ్చల్, జేబీఎస–శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్– ఫ్యూచర్‌సిటీని రూపొందించాలని హెచ్ఏఎంఎల్ అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ క్రమంలో పార్ట్–ఏ డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో గతేడాది నవంబర్–4న కేంద్రానికి పంపించగా.. తాజాగా పార్ట్–బీకి సంబంధించిన మూడు కారిడార్ల డీపీఆర్‌ను హెచ్ఏఎంఎల్ బోర్డు ఆమోదంతో 8న రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది.

# ప్రధానితో తెలంగాణ సీఎం భేటీ

త్వరగా మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి ప్రధానిని అభ్యర్థించారు. ఈ విషయంలో పట్టణాభివృద్ధి శాఖకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు వ్యూహాత్మకమైన రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ భాగాలకు ఒకేసారి ఆర్థిక, మంత్రివర్గ అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన భూసేకరణ ఖర్చులో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా ఒక గ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైన్‌ను నిర్మించే ప్రతిపాదనకు కేంద్రం సహకరించాలని రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో వాణిజ్య, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా హైదరాబాద్ సమీపంలో ఒక డ్రై పోర్టును ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా ఆయన ప్రధాని దృష్టికి తీసుకువెళ్లారు. ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేందుకు ప్రత్యేకంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మార్గంతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైన్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మొదటిపేజీ తరువాయి

## జాబ్ మేళా కి నిరుద్యోగ యువతని తరలించిన నవీన్ రాథోడ్



తొలిఅడుగు, వైరా, మే 24 : వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు యువజన కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్ ఆధ్వర్యంలో జూలూరుపాడు మండలం నుండి నిరుద్యోగులు తరలివెళ్లారు. జాబ్ మేళాకు బయలుదేరిన నిరుద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి , సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంపీ ఓ తులసి రామ్, ఏ ఎస్ ఐ మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ దయానంద్, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, నాయకులు తోట శ్రీనివాసరావు,బానోత్ బాబు తదితరులు ఉన్నారు.

## బెండే మధునుపరామర్శించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి




తొలిఅడుగు, గజ్వేల్, మే 24 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండే మధు ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా బెండే మధు ను వారి స్వగృహం లో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెండే మధు మంచి ఆరోగ్యం తో కోలుకోవాలని సమయానికి మందులు తీసుకుని ఆరోగ్యం మంచిగా చూసుకోవాలని ఏమ్మెల్సీ యాదవరెడ్డి సూచించారు.

# మహిళా శక్తికి నిదర్శనం అహల్య భాయ్ హెూల్కర్..



– అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

తొలిఅడుగు, నిజామాబాద్, మే 24 : అహల్య భాయ్ హెూల్కర్ 300వ జయంతి ఉత్సవాల సందర్భంగా నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజ హారతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... లోక మాత మహారాణి అహల్యాబాయి హెూల్కర్ హిందూ దేవాలయాలకు గొప్ప మార్గదర్శకురాలు నిర్మాణకర్త అన్నారు. ఆమె భారతదేశం అంతటా వందలాది దేవాలయాలు ద్వారక నుంచి మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మాణం చేశారన్నారు. 1780లో ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణ, మరమ్మత్తు ఆమె అత్యంత ముఖ్యమైన కృషి ఉందని తెలియజేశారు. అహల్య భాయ్ పాలనలో పక్షపాతం లేకుండా న్యాయ పరిపాలన నిర్వహించడంలో ఖ్యాతిని సంపాదించిందని దానికి ఉదా: ఆమె తన ఏకైక కుమారుడిని ఏనుగుతో చితకబాది మరణశిక్ష విధించిందం అన్నారు. ఆమె తన పాలనలో పిల్లలు లేని వితంతువుల ఆస్తిని జప్తు చేసే సాంప్రదాయ చట్టాన్ని తొలగించడంతో సహా కొన్ని మైలురాయి నిర్ణయాలు కూడా తీసుకుందన్నారు. ఈ దేశ ప్రజలు ఎమర్జెన్సీ విధించి, హిందువులకు బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి ఈ దేశాన్ని విచ్చిన్నం చేసిన ఇందిరా చరిత్ర కాదు తెలుసుకోవాల్సింది. అహల్య భాయ్, ఝాన్సీ లక్ష్మి భాయ్, రాణి రుద్రమ్మ, ఛత్రపతి శివాజిని తయారు చేసిన జిజియా భాయ్ లాంటి ధీర వనితల చరిత్ర తెలుసుకోవాలని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేడు సమాజంలో హిందువులపై జరుగుతున్నా దాడులు, హిందూ దేవాలయాలపైన జరుగుతున్నా దాడులను హిందువులుగా అందరం సంఘటీతం అయి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో నాగోళ్ళ లక్ష్మినారాయణ, ప్రోగ్రాం కన్వినర్ పోతంకర్ లక్ష్మినారాయణ, కో కన్వినర్ ప్రవళిక, శ్రవంతి, జ్యోతి బిజెపి మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు

తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని రాములు(55) శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రాములు చెట్టుపై నుండి పడడంతో ప్రస్తుతం జీవనోపాధి గీత కార్మిక వృత్తికి దూరమయ్యాడని, రెక్క ఆడితే డొక్కా ఆడని పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం రాములు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు.




## అక్రమ అరెస్టులతో దళిత బంధు ఉద్యమాన్నీ ఆపలేరు

తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : దళితబంధు సాధనసమితి హుజురాబాద్ మండల ఇంచార్జి అకినపల్లి ఆకాష్ స్థానిక ఎలక్షన్ కోడు వచ్చే సూచనలో ఉన్న ప్రభుత్వం దళిత బంధు విడుదల చేయకపోవడంతో దళిత బంధు సాధన సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దళిత బంధు సాధన సమితి హుజురాబాద్ మండల ఇంచార్జి అకినపల్లి ఆకాష్ ను దళిత బందు నాయకులను హుజురాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ ... 15 నెలలుగా దళితబంధు మరియు అంబేద్కర్ అభయా హస్తం సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధుకోసం కేటాయించిన నిధులు విడుదల చేయకుండా అలాగే అంబేద్కర్ అభయహస్తం పథకం ప్రారంభించకుండా దళితులకు అన్యాయం చేస్తుందని వాటి పై ప్రశ్నిస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మా అకౌంట్లో ఉన్న డబ్బులు విడుదల చేస్తూ ఈ స్థానిక




ఎలక్షన్ లోపు రూపకల్పన చేసి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దళిత జాతుల అభ్యున్నతి కోసం పనిచేసే నాయకులను అరెస్టు చేయడం వల్ల ఉద్య మాన్ని అణిచివేయలేరు అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హుజురాబాద్ నూతన ఏసిపి మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసిన సిలివేరు శ్రీకాంత్

తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : జమ్మికుంట పట్టణానికి చెందిన కంటెస్టడ్ శాసనమండలి అభ్యర్థి సిలివేరు శ్రీకాంత్ హుజురాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి మాధవిని తన కార్యాలయంలో శనివారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేయడం జరిగింది ఈ సందర్భంగా కంటెస్టడ్ శాసనమండలి అభ్యర్థి సిలివేరు శ్రీకాంత్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం లో గంజాయి ఏరులై పారుతుందని విద్యార్థులు గంజాయి మత్తులో పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని గంజాయి వద్దు చదువే



ముద్దు అనే నినాదంతో ముందుకు పోయేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఏసిపి వాసంశెట్టి మాధవిని కోరారు తక్షణమే స్పందించిన ఆమె తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో శానకొండ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరించిన హుజురాబాద్ ఏసీపీ మాధవి

తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ వేడుకల పోస్టర్ను శనివారం హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి ఆవిష్కరించారు. టీయూడబ్ల్యూజే హెచ్ 143 జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ టీయూడబ్ల్యూజే హెచ్143 యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 31న హైదరాబాద్లోని జలవిహార్ ఆడిటోరియంలో “తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు” అనే నినాదంతో టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలు జరగనున్నాయన్నారు. జర్నలిస్టులందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అడహక్ కమిటీ కన్వీనర్ గూడూరి కొండల్ రెడ్డి, కో కన్వీనర్లు కోయల్ కార్ శ్యామ్, కనకం శ్రీనివాస్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మండల యాదగిరి, జర్నలిస్టులు సబ్బని వెంకటేష్, కేసరి మధుకర్, ఇప్పలపల్లి నరేష్, సుంకరి రాజమౌళి, కొండపర్తి శ్రీనివాస్, వోడపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



# పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

- మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి
- వైస్ చైర్మన్ బట్ట పరశురాం



తొలిఅడుగు, గజ్వేల్, మే 24 : కుకునూర్పల్లి మండల కేంద్రంలో రైతులకు 50% సబ్సిడీ పైన జనుము విత్తనాల పంపిణీ చేయడం జరిగింది. ఈరోజు అగ్రోస్ రైతు సేవ కేంద్రం లో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి రైతులకు జనుము విత్తనాల అందచేశారు. మండలానికి 20 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో కలవు. రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పర్మిట్ పొంది అగ్రోజ్ రైతు సేవ కేంద్రానికి వచ్చి 40కిలోల జనుము బస్థకు రూపాయలు 2510 చెల్లించి తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ బట్ట పరశురాం మరియు డైరెక్టర్లు ,మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్యశ్రీ, శ్రీహరి ,రైతులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో... విస్తృతంగా లయన్స్ క్లబ్ సామాజిక సేవలు

- లయన్స్ క్లబ్ ప్రపంచంలోనే అత్యంత అతిపెద్ద సేవా సంస్థ
- పేద విద్యార్థులు, ప్రజల అవసరాలు తీర్చడమే ప్రధాన లక్ష్యం
- కరోనా వంటి కష్టకాలంలో విస్తృతంగా సామాజిక సేవలు
- శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



తొలిఅడుగు, గజ్వేల్, మే 24 : అంతర్జాతీయ స్థాయిలో సామాజిక సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ పేద విద్యార్థులు, ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ చైర్మన్ ఉప్పల మెట్టయ్య గుప్త, లయన్స్ క్లబ్ ఆఫ్ విజ్డం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థగా కీర్తి గడిచిన లయన్స్ క్లబ్ కొన్ని దేశాలతో భాగస్వామ్యం కలిగి ఉండడం విశేషమని స్పష్టం చేశారు. ముఖ్యంగా పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత కంటి వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, అర్ధాకలితో అలమటిస్తున్న వారికి నిత్యవసర వస్తువులు, పోషక పదార్థాల పంపిణీ, అనాధ పిల్లలకు వివిధ రకాల సేవలు, ఎంచుకున్న రంగాల్లో యువతను ప్రోత్సహించడం, పల్లెలు, గ్రామీణ పాఠశాలలను దత్తత తీసుకోవడం వంటి కార్యక్రమాలు చేపడుతూ పేద ప్రజల మన్ననలు పొందుతున్న తెలిపారు. అంతేకాకుండా కరోనా వంటి కష్ట కాలంలో లయన్స్ క్లబ్ అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఉప్పల మెట్టయ్య గుప్త మాట్లాడుతూ తనకు రెండవసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ కు పూర్వ వైభవం వచ్చేలా దృష్టి పెడతానని చెప్పారు. పేద విద్యార్థులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ లయన్స్ క్లబ్ గవర్నర్ మామిడాల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, పూర్వ అధ్యక్షులు దుర్గాప్రసాద్, గోలి సంతోష్ గుప్త, సంజయ్ గుప్త, లయన్ బాల చంద్రం,నేతి శ్రీనివాస్ గుప్త, పరమేశ్వరా చారి, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం

- మండల విద్యాధికారి ప్రభాకర్






తొలిఅడుగు, మే 24 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం లో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయ బృందం గుణాత్మక విద్యను అందిస్తుందని, ప్రభుత్వం అన్నిరకాల వసతులను సమకూర్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల్లో నూతన బోధనపద్ధతులను ఎప్పటికప్పుడు నవీకరించటం కోసం ఈ ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాల్సిందిగా కోరారు. ఐదు రోజుల శిక్షణ విజయవంతం చేయడానికి కృషి చేసిన రిసోర్స్ పర్సన్ లను ఈ సందర్భంగా మండల విద్యాధికారి సన్మానించారు. అలాగే శిక్షణలో చురుకుగా పాల్గొన్న ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంతోషం మల్లారెడ్డి, నూతి మల్లన్న, రాములు,నున్సావత్ మోతిలాల్ నాయక్,రిసోర్స్ పర్సన్లు జాడి శ్రీనివాస్,గంకిడి వెంకటరమణ రెడ్డి, గుర్రాల గంగారెడ్డి, అడిసెర్ల సతీష్, సిరిపురం సునిల్, ఈగం సంతోష్, బి. జలపతి, హైమవతి క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు ఎదుల్ల ప్రేమ్ సాగర్, బట్టు కుమారస్వామి, కవిత, శ్రీలత,మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది సురేష్, సునీత, రాజు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మహేష్ కుమార్ గౌడ్ కృషి

- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి





తొలి అడుగు, నిజామాబాద్, మే 24 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల పైన ఉందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తూనే అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న నాయకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, డిసిపల్లి అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, రూరల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమ్మాజీ నరేష్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు





తొలి అడుగు, నిజామాబాద్, మే 24 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పలు సేవా సంస్థలలో సేవా కార్వక్రమాలు , ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మహేష్ కుమార్ గౌడ్ కు పుట్టినరోజు కానుకగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించి ఆయనకు బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న కృషిని విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మన పైన ఉంది అని తెలిపారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ బీసీ నాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేస్తూనే అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న నాయకుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి,రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, పిసిసి ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, పిసిసి మాజీ కార్యదర్శి రాంభూపాల్,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసా, పార్లమెంట్ మా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా సేవల అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకులు మఠం రేవతి, సుజాత, పోల ఉష, విజయలక్ష్మి,విజయ,అపర్ణ,అవిన్ ,కొండపాక రాజేష్,సిరికొండ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

పొగాకు రైతుల సాగుగాథలు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంలో కౌలు రైతు ఆత్మహత్య! ముప్పాళ్ళ మండలంలో కౌలు రైతు ఆత్మహత్య! ఇంకొల్లు మండలంలో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం! ఎందుకిలా జరుగుతున్నది? సుమారు 90 నుండి 150 రోజులు కష్టపడి ఆటుపోట్లను తట్టుకొని పొగాకు పంట సాగు చేశారు. పంట వేయక ముందు వివిధ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో రైతాంగం చుట్టూ తిరిగి 'నల్ల బర్లీ వేయండి. గత సంవత్సరం రేటు ఇంకా రెండు మూడు సంవత్సరాలు ఉంటుంది' అని ప్రోత్సహించారు. ఫలితంగా పొగాకుతో పాటు ఇతర పంటలు వేసే రైతులు అన్నీ వదులుకొని నల్ల బర్లీ పొగాకు ఒక్కటే సాగు చేశారు. గత సంవత్సరం రేటు సంగతి పైవాడికెరుక. ఇప్పుడు ఎంతో కొంతకు కొనే నాథుడు కూడా లేడు. పైగా సంవత్సరం అంతా ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు, ఎరువులు, పురుగు మందుల షాపుల నుంచి అరువు తెచ్చిన రైతులు, కౌలు రైతులు చివరకు కూలీలకు డబ్బులు ఇవ్వలేకపోతున్నారు. భార్య మెడలో బంగారాన్ని తాకట్టు పెట్టినా సరిపోక అప్పుల వారికి మొహం చూపించలేకపోతున్నారు. కనీసం అడుగు ఆకు అమ్మయినా కూలి డబ్బులు తీరుద్దామంటే అది కూడా దారుణంగా ఉంది. అడుగు ఆకు కోస్తే క్వింటాకి రూ.5000 కూలి అయింది. ఆ అడుగు ఆకుని కంపెనీకి అమ్ముకుంటే కేవలం రూ.2500 వచ్చిందంటే పంట పండించడానికి అయిన ఖర్చు, కూలి కలిపి రాకపోయినా.. కూలీలకైన ఖర్చన్నా రాకపోగా అందులో సగం డబ్బు మాత్రమే వచ్చింది. వీటన్నింటి వలన ప్రత్యేకించి కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.


నేడు రైతులు కేజీ పొగాకును 30 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఆ కేజీ పొగాకుతో కనీసం 1250 నుండి 2000 సిగరెట్ల వరకూ తయారవుతాయి. అంటే ఒక్కొక్క సిగరెట్టుకు 0.7 గ్రాముల నుండి ఒక గ్రాము వరకు పొగాకు వాడతారు. ఈ క్రమంలో కొంత వృధా అయినా తక్కువలో తక్కువగా సగటున 1250 సిగరెట్లు వస్తాయి. ఒక్కొక్క సిగరెట్టు సగటు ధర రూ.10 అనుకున్నా కేజీ పొగాకు ద్వారా ఉత్పత్తి అయిన 1250 సిగరెట్లను అమ్ముకుంటే కంపెనీకి రూ.12,500 వస్తాయి. రైతులకు పొగాకు కోసం రూ.30 నుండి రూ.100 పోతాయి. అంటే ఒక కేజీ పొగాకు ద్వారా రూ.12,400 ఆదాయం కంపెనీకి వస్తుంది. ఒక ఎకరాకు 12 నుండి 13 క్వింటాళ్ళు పొగాకు పండిస్తున్నారు. అంటే క్వింటా రూ.10,000 చొప్పున 12 క్వింటాళ్లు కొన్నారనుకుంటే రైతులకు రూ.1,20,000 వస్తున్నాయి. రైతు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.లక్ష 50 వేలు అయ్యింది. దాంతో రైతుకు ప్రతి ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేలు నష్టం వస్తుంది. అదే కంపెనీకి కేజీ పొగాకుతో చేసిన 1250 సిగరెట్లు అమ్ముకోవడం ద్వారా రూ.12,400 వస్తుంది. ఎకరా పొగాకు ద్వారా కంపెనీకి రూ.12 లక్షల 40 వేల ఆదాయం వస్తుంది. ఈ అంకెలు కొంచెం నమ్మడానికి కష్టంగా ఉంటుంది. కానీ ఐటిసి కంపెనీ అనేక వ్యాపారాలు చేస్తుంది. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం మేరకు 2024 సంవత్సరంలో కంపెనీ రూ.20 వేల 751 కోట్ల నికర లాభం పొందింది. ఆ కంపెనీకి రూ.91,826 కోట్ల విలువ గలిగిన స్థిరాస్తులున్నాయి. ఐటిసి కంపెనీ సీఈఓ జీతం నెలకు రూ.రెండు కోట్ల పైనే. అంటే గంటకు రూ.10 లక్షలు జీతం. మన రైతు సంవత్సరం అంతా ఎండనకా వాననకా ఆరుగాలం కష్టపడి పనిచేసినా%ఔ%ఆయన గంట జీతం అంత కూడా సంపాదించలేకపోతున్నాడు.

క్యాడ్బరీ పరిస్థితి కూడా అలాగే వుంది. నేడు అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలు కేజీ రూ.800 నుంచి రూ.900 రూపాయలు తక్కువ కాకుండా కొంటున్నారు. కానీ మన రాష్ట్రంలో మాండలిస్ కంపెనీ ఈ కోకో గింజలను కేవలం 450 రూపాయలకే కొంటున్నది. ఒక కేజీ కోకో గింజల నుంచి 800 గ్రాముల కోకో నిబ్స్ వస్తాయి. 400 నుండి 500 గ్రాముల కోకో లిక్విడ్ వస్తుంది. వంద గ్రాముల కోకో చాక్లెట్‌లో 70 గ్రాముల కోకో పదార్థాలుంటాయి. వంద గ్రాములు కోకో లిక్విడ్‌తో పది చాక్లెట్లు వస్తాయి. అలాగే మిల్క్ షేక్ అయితే 12 నుంచి 16 ముక్కలు వస్తాయి. చాక్లెట్లు ఒక కేజీకి సుమారుగా 150 ముక్కలు వస్తాయి. అంటే తక్కువలో తక్కువ కంపెనీకి రూ.16 వేలు వస్తాయి. కానీ రైతుకి ఇస్తున్నది కేజీకి రూ.450 మాత్రమే. అంటే రైతుకిచ్చిన దానికి అదనంగా 40 రెట్లు లాభం కంపెనీకి వస్తుంది. మాండలిస్ కంపెనీ 2022-2023లో రూ.1176 కోట్ల నికర లాభం పొందగా, 2023-2024లో రూ.2020 కోట్ల నికర లాభాలు సంపాదించింది. ఆ కంపెనీ కూడా రూ.5.76 లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులున్నాయి. ఈ కంపెనీ షేర్ విలువ కూడా 64.14 డాలర్లకు పెరిగింది. ఈ మధ్య కాలంలో చాక్లెట్ల ధర 22 శాతం నుండి 30 శాతం వరకు పెంచారు. క్యాడ్బరీ కంపెనీ ఎమ్.డి స్థాయి అధికారుల జీతాలు నెలకు రూ.64 లక్షల నుండి రూ.96 లక్షల మధ్యలో ఉన్నాయి. అలాగే ఇతర ఉన్నతాధికారులు జీతాలు కూడా లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ కంపెనీల లాభాలకు, స్థిరాస్తులకు, ఉన్నతాధికారుల జీతాలకు ముడి పదార్థమే మూలం. ఆ ముడి పదార్థం లేకపోతే కంపెనీ లేదు. లాభాలు లేవు. ఆస్తులు కూడా ఉండవు. కానీ ఆ ముడి పదార్థం పండించే రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. వున్న కొద్దో గొప్పో ఆస్తులను కూడా అమ్ముకుంటున్నారు. చివరకు ఆత్మాభిమానంతో అప్పుల వారికి మొహం చూపించలేక అప్పులు తలుచుకుంటూ ఆప్తులను, భార్యాబిడ్డలను కూడా వదులుకొని ఆత్మహత్య చేసుకుంటున్నారు. కంపెనీలు లాభాలతో కోట్లకు పడగలెత్తుతుంటే, పొగాకు సాగు చేసిన కౌలు రైతులు చివరకు ఆత్మహత్య చేసుకుని పాడెక్కుతున్నారు. డబ్బు కంటే విలువైనది ప్రాణం. ఆ విలువైన ప్రాణాన్ని రైతాంగం బలవంతంగా తీసుకుంటున్నారంటే ప్రభుత్వం, ప్రజలు, సభ్యసమాజం ఆలోచించాలి. మీటింగ్‌కి వెళ్తున్నారా అని వెటకారంగా పలకరించటం, మంత్రిగారి దగ్గరికి వెళ్తున్నారా, కొనుగోలు ఇంకా ఆలస్యం అవుతుందని హెచ్చరించడం, ధర్నా చేస్తున్నారా ధర ఇంకా పడిపోతుందని బ్లాక్ మెయిల్ చేయడం. ఇదీ కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో చేసే ప్రచారం. వాస్తవంగా పొగాకు వేయమని ప్రజల్లో ప్రచారం చేసి, నమ్మించి మోసం చేసినందుకు ఈ కంపెనీ ప్రతినిధుల మీద ఐపిసి సెక్షన్ 426 కేసు పెట్టాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీల ప్రతినిధులు పలు దఫాలు చర్చించారు. అయినా కొనుగోలు వేగవంతం కాలేదు. మంత్రులు చర్చల తర్వాత కూడా కంపెనీలు కొనుగోళ్లు చేయటం లేదు. అంటే ప్రభుత్వ పాత్రని అనుమానించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో... పొగాకు సాగుదారులందరూ ఐక్యంగా పోరాడితేనే పంటకు గత సంవత్సరం ధర సాధించగలుగుతారు.

# అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించిన దళిత బంధు సాధన సమితి నాయకులు , లబ్ధిదారులు







తొలిఅడుగు, హుజురాబాద్ , మే 24 : దళితబంధు మంజూరు లో మొదటి ప్రాధాన్యత 10లక్షలు 840000 మరియు 500000 ఉన్న వాళ్లకు ఇవ్వాలి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించిన బాధితులు- దళిత బంధు విడుదల చేయకుంటే ఉద్యమానికి పిలుపునిస్తామని ప్రభుత్వాన్నీ హెచ్చరించిన దళిత బంధు సాధన సమితి ఈరోజు దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో హుజురాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద దళితబంధు రెండవ విడత రాణి బాధితులు ఆందోళన చేపట్టారు గత 16నెలలుగా రెండవ విడత నిధులకోసం అనేక కార్యక్రమలు చేసిన ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్టుగా వ్యవహరిస్తుంది జనవరి 27 2025 న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుండి ఆర్డర్ కాపీ జారీ చేసినప్పటికి గ్రౌండింగ్ ప్రక్రియ మొదలుపెట్టడం లేదు అనేక సార్లు ప్రజావాణి లో కలెక్టర్ కి వినతిపత్రం అందించిడం జరిగింది అయిన జూన్ 2వ తేదీ నుండి మొదలు పెడుతున్నాం అని ఈడీ చెప్పారు కానీ మొదటి ప్రాధాన్యత 5లక్షల వారికీ ఇవ్వాలి అని సాధన సమితి పక్షాన డిమాండ్ చేస్తున్నాం వెహికిల్స్ తీసుకున్న వాళ్లకు 9లక్షల పైనే మంజూరు చేసారు అయినప్పటికీ మళ్ళీ వాళ్ళకే మిగిలి ఉన్న నిధులు మంజూరు చేయడానికి జిల్లా కలెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లిస్ట్ తయారు చేస్తున్నారని సమాచారం ఇదే గనుక జరిగితే దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో బాధితులం అంత ఏకమై కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్న కడుపు నిండినోడికే ఇంకా పెడుతారా ఒక్కరోజు కూడా మాతో కలిసి కార్యక్రమలకు రాణి వాళ్లకు ఎలా మంజూరు చేస్తరు కడుపుకాలి రోడ్డెక్కి పోరాటాలు చేసింది మేము అరెస్టులు అయింది మేము కేసులు మేసుకుంది మేము ఇప్పటివరకు పూర్తిగా 10లక్షలు తీసుకొని వాళ్ళు ఉన్నారు అలాగే డైరీ ఫర్మ్ పెట్టుకున్న వాళ్లకు 150000 వచ్చి వారి ఖాతాలో 840000 ఉన్న వాళ్ళు ఉన్నారు మొదటగా 10లక్షలు 840000లక్షలు 5లక్షల వాళ్ళకు ఇచ్చిన తరువాతే మిగితా వాళ్ళకు మంజూరు చేయాలనీ డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో అధికారులతో పాటు కాంగ్రెస్ పారీ నాయకుల ఇంటి ముట్టడి మంత్రుల ఇంటి ముట్టడి చేయడానికి కూడా వెనకడుగు వేయమని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు కోలుగూరి నరేష్ శనిగరపు రవీందర్ సరిత సౌజన్య కోమల సమ్మక్క పాత రాజేష్ వంశీ భాగ్య తో పాటు సుమారు 300మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ ఒప్పుకున్న రాహుల్ ఒప్పుకోవడం లేదు..

- రాహుల్ కు పాకిస్తాన్ కు ఉన్న సంభందం ఏంటి?
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్.



తొలిఅడుగు, ధర్మపురి మే 24 : పెగడపెల్లి: ఆపరేషన్ సింధూరం ద్వారా పాకిస్తాన్ కు జరిగిన ధన, మాన, ప్రాణ నష్టాన్ని పాకిస్తాన్ ఒప్పుకుంటున్న రాహుల్ గాంధీ మాత్రం ఒప్పుకోవడం లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం విమర్శించారు. పహాల్గామ్ సంఘటన జరిగి పదిహేను రోజులు గడువక ముందే పాకిస్తాన్ లోని తొమ్మిది తీవ్రవాద స్థావరాలను పెల్చివేసి పదకొండు ఎయిర్ బేస్ లను కూల్చివేచి 170 మందికి పైగా తీవ్రవాదులను మట్టి కరిపించి నలభై రెండు మంది పాక్ ఆర్మీని చంపి తగిన బుద్ధి చెప్పితే పాకిస్తాన్ కాళ్ళ బేరానికి వస్తే సీజ్ ఫైర్ చేసినందుకు రాహుల్ గాంధీకి వచ్చిన నొప్పి ఏంటని ప్రశ్నించారు.సీజ్ ఫైర్ విషయంలో ఏదేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి, హోమ్ శాఖ మంత్రి, రక్షణ శాఖ మంత్రి స్పష్టంగా చెప్పినప్పటికి అదే విషయాన్ని రాహుల్ గాంధీ పదే పదే వల్లే వేయడం స్వదేశాన్ని అవమానించడమేనని అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా చివరి రోజునజమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాదులను దగ్గరినుండి చూశానని వాళ్లు నాతో మాట్లాడాలని అన్నారని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమో లేదా పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదులకు భారత్ లో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏమైనా అన్నదమ్ముల కొడుకులా అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు ఉగ్రవాదులు రాహుల్ ను కలిసి మాట్లాడాలి అన్న విషయంలో ఎందుకు స్పందించడం లేదన్నారు.దేశ సైనికులను అవమానిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సైనికులకు స్వేచ్ఛ లేదని కాల్పులు జరపాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరని అందుకే వేలాది సైనికులు మరణించారని అన్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడు అయినా పట్టలేడు అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారం ఉందని ఎద్దేవాచేశారు.పాకిస్తాన్ తో యుద్ధం ఎందుకు జరుపలేదని ప్రశ్నించిన రాహుల్ ఇందిరమ్మ హయాంలో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో ఇందిరాగాంధీ నిర్ణయం భేష్ అంటున్న రాహుల్ మరి అదే సమయంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఎందుకు స్వాదీనం చేసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. దేశ రక్షణకు సంబంధించిన రహస్యాలు గోప్యంగా ఉంచుతారని అవి ఎవరికి చెప్పాల్సిన అవసరం లేదన్నారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పాకిస్తాన్ లో ఎక్కువ ట్రెండ్ అవుతున్నాయంటే రాహుల్ కు పాకిస్తాన్ లోనే ప్రేమికులు ఎక్కువగా ఉన్నారని అర్ధం అవుతుందని ఎద్దేవాచేశారు.

# ఘనంగా పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు


- రేణుక ఎల్లమ్మ ఆలయం లో పూజలు నిర్వహించి, రోగులకు బ్రేడ్స్ పండ్ల పంపిణి
- చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్



తొలి అడుగు, చిన్నకోడూరు, మే 24 : పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను చిన్నకోడూరు మండల కేంద్రం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలనీ ఆయన సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ మరో పదేండ్ల అధికారంలో ఉండాలని మండల కేంద్రంలోనీ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో రోగులకు పండ్లు, బ్రేడ్స్ పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాములు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, వికలాంగుల విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరాల రాజు, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి సలీం, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటి, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఉడుత జయంత్, ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షులు నమండ్ల వినోద్, యూత్ కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, సీనియర్ నాయకులు గుడిమల్ల మల్లేశం, రాజ వర్ధన్ రెడ్డి, దూది మల్లారెడ్డి, గొట్టిపర్తి చందు, నక్కరాజు, వేణు, శేషు, కొమ్మరాజుల చందు, కొమరాజుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదు యూత్ కాంగ్రెస్ నాయకుడు చిన్నల శ్రీకాంత్ యాదవ్

- టీఆర్ఎస్ పార్టీలో బయటపడుతున్న అంతర్గత విభేదాలు
- బిజిగిరి షరీఫ్ దర్గాకు వస్తే కేసీఆర్ కు పట్టిన దయ్యాన్ని వదిలిస్తాం



తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : టీఆర్ఎస్ పార్టీలో తిరుగుబాటు మొదలైందని పార్టీ అధినేత కేసిఆర్ కూతురు స్వయంగా కేసీఆర్ కు పలు ప్రశ్నలు సంధిస్తూ లేఖ రాయడం రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ, పది సంవత్సరాలు తెలంగాణ ప్రజలను మోసం చేసి అక్రమంగా కోట్ల రూపాయలను సంపాదించిన కేసీఆర్ కు రాష్ట్ర ప్రజలు సరైన గుణపాఠం చెప్పి కెసిఆర్ ను ఫామ్ హౌస్ కి పంపించారని వారు తెలిపారు. కెసిఆర్ మీద నమ్మకం లేక రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిర్ణయించుకొని భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించి టిఆర్ఎస్ పార్టీకి సరైన బుద్ధి చెప్పారని వారు తెలిపారు. కెసిఆర్ సొంత కూతురు కల్వకుంట్ల కవిత కెసిఆర్ చుట్టూ నాలుగు దయ్యాలు ఉన్నాయని ఆ నలుగురిని దూరం పెడితే పార్టీకి భవిష్యత్తు ఉంటుందని బహిరంగంగా తండ్రికి ఉత్తరం రాయడం టీఆర్ఎస్ నాయకుల్లో భయం పుచ్చుకున్నదని వారు అన్నారు. సొంత పార్టీని చక్కదిద్దుకోలేని కెసిఆర్ రేవంత్ రెడ్డి పరిపాలన పై దుష్ప్రచారం చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని వారు ఎద్దేవ చేశారు. అమెరికా నుండి హైదరాబాద్ కు చేరుకున్న కల్వకుంట్ల కవిత తండ్రికి తానే ఉత్తరం రాసానని బహిరంగంగా చెప్పడంతో టిఆర్ఎస్ నేతల్లో అలజడి మొదలైందని సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న టిఆర్ఎస్ నేతలు ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ఉండాలని లేకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. కెసిఆర్ కు పట్టిన దయ్యాన్ని వదలగొట్టాలంటే జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ దర్గాకు తీసుకు వస్తే ఆ దయ్యాలను పంపిస్తామని కవిత కు సూచించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిన్నల శ్రీకాంత్ నియోజకవర్గా కార్యదర్శి ఉమ్మడి సందీప్ యువజన కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి రంజిత్ రెడ్డి జమ్మికుంట పట్టణ ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు బిసాడి వంశీ జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దేవునూరి వినయ్ అకినపల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిపిసిసి అధ్యక్షులు శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



తొలిఅడుగు, హుజురాబాద్, మే 24 : జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి లో గల స్పందన అనాధాశ్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు వావిలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వానరాశి జాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కార్యకర్త నుండి మొదలైన తన రాజకీయ ప్రస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షునిగా, యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీకి గొప్పగా సేవలందించినందుకు గాను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా శాసనమండలి సభ్యునిగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్ర నేతలు శ్రీమతి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు ఏదో ఒక రోజు గొప్పగా అవకాశం వస్తదనడానికి ఉదాహరణ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అని రానున్న రోజులలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలు సహకార సంఘాల ఎన్నికలు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో గొప్పగా ముందుకెళ్లి విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల సాంబశివరెడ్డి జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిలువేరి రాజమౌళి యువజన కాంగ్రెస్ మడిపల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు ల్యాదల వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ సందాని తూర్పాటి రాజు సోమిడి అభిలాష్ తూర్పాటి జస్వంత్ వానరాశి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కళాజాతతో అవగాహన





తొలిఅడుగు, గజ్వేల్, మే 24 : పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే 23న రాత్రి గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని "రిమ్మనగూడ గ్రామంలో" నిర్వహించడం జరిగింది. గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా అక్కన్నపేట ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న యువతి యువకులపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని సూచించారు స్కూలుకు వెళుతున్నారా కాలేజీకి వెళుతున్నారా ఇంకెక్కడైనా తిరుగుతున్నారా నిఘా ఉంచడం చాలా ముఖ్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి మోహన్ మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి ఆశ, భయము, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి, బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు సీసీ కెమెరాలు 24 గంటలపాటు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీని ఇస్తాయని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దు మూఢనమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, ప్రసాద్, బిక్షపతి, నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు గ్రామ యువతి యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వయోజనులందరికీ విద్యనందించటమే ఉల్లాస్ లక్ష్యం

- మండల విద్యాధికారి ప్రభాకర్



తొలిఅడుగు, మే 24 : ధర్మారం మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో ఏ ఒక్క వయోజనులు కూడా నిరక్షరాస్యులుగా ఉండకూడదని ప్రతీ ఒక్కరిని విద్యావంతులుగా చేయటం కొరకే ఉల్లాస్ కార్యక్రమం రూపొందించారని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం రోజు మధ్యాహ్నం నిర్వహించిన ఉల్లాస్ సర్వే అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ "ఉల్లాస్" అనేది సమాజంలో విద్యకు దూరమైన వయోజనులను విద్యావంతులుగా చేసే స్వచ్ఛంద కార్యక్రమం అనీ, ఇది కేంద్ర ప్రభుత్వంచేత ప్రారంభించబడిన కార్యక్రమం అనీ ఇది పదిహేను సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలకు చదువు మరియు నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా తీసుకున్న మంచి కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమం యొక్క అంతిమ లక్ష్యం అధికారిక విద్యావిధానం నుండి వెళ్ళిపోయిన లేదా అవకాశం లేని పెద్దలకు చదువు మరియు నైపుణ్యాలను అందించడమని పేర్కొన్నారు. ఇది ప్రజల భాగస్వామ్యం తో విజయవంతం అవుతుందన్నారు. ఇది ఒక ఉద్యమం లాగ తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఇది ప్రజలందరినీ అక్షరాస్యులుగా మార్చడానికి మరియు ప్రతి ఒక్కరినీ సాధికారత కలిగించే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా చదువుకు దూరమైనా వయోజనులను గుర్తించే సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన విపులీకరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపివో శ్రీనివాస్, ఎపియం తులసిమాత మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు లావణ్య మండల పరిధిలోని సీసీలు, విఓయేలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపద్బాంధవుడు కొలుముల దామోదర్ యాదవ్ ఎన్నారై (కెనడా) తేలుకుంటలో బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



తొలిఅడుగు, జులపల్లి, మే 24 : కొలుముల దామోదర్ ఫౌండేషన్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేత జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన పైండ్ల భూమయ్య కుమారుడు పైండ్ల మహేష్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని పలు ఆసుపత్రులలో వైద్యం కోసం తిరుగుతూ భారీగా డబ్బులు ఖర్చు కాగా మరింత మెరుగైన చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నారు.. ఈ విషయాన్ని కొత్తూరు గ్రామానికి చెందిన కొలుముల దామోదర్ (ఎన్నారై కెనడా) గారి దృష్టికి తీసుకెళ్లి వీరి ఆర్థిక పరిస్థితి వివరించి సాయం చేయాలని కోరగా వైద్య ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని తన బాల్య మిత్రుడు అమరగాని ప్రదీప్ కుమార్ ద్వారా పంపించారు. ఈరోజు జూలపల్లి మండల నాయకులతో కలిసి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ తేలుకుంట గ్రామం లో వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పైండ్ల మహేష్ గత పదేళ్లుగా వైద్యం కోసం పోరాడుతూ కుటుంబం మొత్తం ఆర్థికంగా చితికి పోయిందని మండలంలోని దాతలు మానవతా దృక్పథంతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.. మహేష్ కు ఆర్థికసాయం చేసి ఆదుకున్నందుకు దామోదర్ యాదవ్ కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎంతో మంది ఆపదలో ఉన్నవారికి తన మిత్రుడు దామోదర్ తన కోలుముల దామోదర్ ఫౌండేషన్ ద్వారా పెద్దఎత్తున నిస్వార్థంగా సహాయ కార్యక్రమాలు చేస్తున్నారని తన కుటుంబానికి భగవంతుని ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెంట లచ్చన్న,సీనియర్ నాయకులు ఠాకూర్ ప్రదీప్ సింగ్, దావు సంపత్ రెడ్డి,పెద్దోళ్ల ఐలయ్య, సంగెం వేణు, అడ్డగుంట ధర్మరాజు, కోడూరి చంద్రమౌళి, అలుభోజు శ్రీనివాస్, మేరుగు కనకన్న, తదితరులు పాల్గొన్నారు

# దళిత బంధు సాధన సమితి నాయకులపైనా కేసు నమోదు



– సీఐ రామకృష్ణ గౌడ్

తొలిఅడుగు, హుజురాబాద్, మే24 : జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ సిబ్బందితో టౌన్ పెట్రోలింగ్ చేస్తూ ఉండగా జమ్మికుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొలుగురి సురేష్ తండ్రి రాజమల్లు, మంద రాజేష్ తండ్రి జంపయ్య, బండారి ప్రశాంత్ తండ్రి సంపత్ అనువారు సమూహంగా ఉండి దళిత బంధు రెండవ విడతను మంజూరుకై వెంటనే ఉద్యమం ప్రారంభించాలని హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద దర్నాకి దళిత బందు లబ్ధిదారులను తీసుకొని వెళ్లడానికి ప్రయత్నం చేస్తూ ఉండగా భాగంగా వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ వేడుకలు...



తొలిఅడుగు, గజ్వేల్, మే 24 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణ కేంద్రంలో తిరంగా ర్యాలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు గజ్వేల్ పట్టణ కేంద్రంలో గల అంగడి హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ ప్రారంభమై ఇందిరా పార్క్ చౌరస్తా మీదుగా పిడిచేట్ రోడ్డులో గల వివేకానందుడి విగ్రహం ముందు నుండి మున్సిపల్ కార్యాలయం వద్ద ముగింపు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ సీనియర్ నాయకులు మరియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ గార్లు మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రవాదులను దేశ మహిళా మూర్తుల నుదుటన సింధూరాన్ని దూరం చేసినందుకు ఆపరేషన్ సింధూర పేరిట పాకిస్తానీ ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చడం జరిగిందన్నారు. మహిళల భర్తలను చంపి మోడీకి చెప్పుకో అన్నందుకు శ్రీ నరేంద్ర మోడీ గారు పాకిస్తానీ ఉగ్రవాదులకు మహిళా జవాన్లతోటే ఉగ్రవాదాలను హతమార్చారు అన్నారు. భారత సైన్యానికి వారు చేస్తున్నటువంటి కృషికి ప్రజలందరూ వారికి ఎన్నటికీ రుణపడి ఉంటామన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇది కేవలం ట్రయల్ మాత్రమే ముందుంది అసలైన యుద్ధమని అన్నారు.. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ గారు రాష్ట్ర నాయకులు ఏళ్ళు రామిరెడ్డి ఎరుపుల వెంకటరమణ నలగామ శ్రీనివాస్ నందన్ గౌడ్ గురవారెడ్డి సింగం సత్తయ్య కుడిక్యాల రాములు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా నియోజకవర్గ నాయకులు బండారి మహేష్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ కొండపాక నీల సత్యం ములుగు లక్ష్మణ్ గౌడ్ జగదేవ్‌పూర్ ఐలయ్య యాదవ్ కుకునూరుపల్లి సంపత్ రెడ్డి వర్గల్ తిరుపతిరెడ్డి మరియు సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్ గర్నెపల్లి కృష్ణమూర్తి పెండ్యాల శ్రీనివాస్ మన్నె శ్రీనివాస్ శ్రీరామ్ శ్రీకాంత్ వెంకట్ రెడ్డి నత్తి శివకుమార్ బారు అరవిందు నాయని సందీప్ మహిళ నాయకురాలు కట్ట భాగ్యలక్ష్మి సుమతి రాణి మమత భక్తమాల మరియు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు వివిధ మోర్చాల నాయకులు మహిళ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# దళిత ద్రోహి కడియం శ్రీహరి

– బీఆర్ఎస్



తొలిఅడుగు, జనగామ, మే 24 : లింగాల గణపురం మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ దళిత నాయకుల ఆధ్వర్యంలోదళిత ద్రోహి కడియం శ్రీహరి కి వ్యతిరేకంగా ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది మాదిగలకు కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు మూడు ఎంపీ స్థానాలు ఉంటే ఒక్కటి కూడా ఎస్సీ మాదిగకు కేటాయించని పార్టీ కాంగ్రెస్ పార్టీ అట్లాంటిది మాదిగలకు మేమేదో చేసామని చేస్తామని అబద్ధపు ప్రచారాలతో మాదిగలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ రేపు జరగబోయే కాంగ్రెస్ మాదిగ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించింది ఎవరిని దళిత ద్రోహిని దళిత పేరు వాడుకుంటూ దళితుల హక్కులను కాలరాస్తూ దళిత జాతిని రాజకీయంగా అణచదొక్కుతున్న కడియం శ్రీహరి ని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం హాస్యాస్పదంగా ఉంది మాదిగ బిడ్డల మధ్య చిచ్చు పెట్టి పబ్బం కడుక్కునే నాయకుడు కడియం శ్రీహరి అలాంటి నాయకుడు మాదిగ జాతికి చేసింది ఏమీ లేదు ఒక్క మాదిగ బిడ్డను కూడా రాజకీయంగా ఎదిగనివ్వడా స్టేషన్ ఘన్పూర్ లో పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో కార్యకర్తలను ఎటు పార్టీని కాపాడుకుంటూ వచ్చిన ఇందిర ఇప్పుడు ఎక్కడున్నా రు కేవలం కడియం శ్రీహరి రాజకీయ ఎత్తుగడలలో ఎంతోమంది మాదిగ నాయకులు బలైపోయారు ఇంకా కూడా విభజించి పాలించాలన్నట్లు మాదిగ బిడ్డలలో చిచ్చులు పెట్టడం మానుకోవాలి స్టేషన్ఘన్పూర్ లో అభివృద్ధి పేరు చెబుతూ అధికార దాహంతో బీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ టికెట్ బీఆర్ఎస్ కార్యకర్తల శ్రమతో గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా అధికార పార్టీకి పోవడాన్ని అధికార దాహం తో ఇంకా మబ్బే పెట్టడం ప్రజలు గమనిస్తున్నారు కేవలం స్వార్థంతో బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం వెన్నుపోటు రాజకీయాలు చేయడం శ్రీహరి కి వెన్నతో పెట్టిన విద్య అలాంటి నాయకుడు మాదిగ జాతి పేరు చెప్పుకొని పబ్బం గడపడం మానుకుంటే మంచిది మండల దళిత నాయకులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉడుగుల భాగ్యలక్ష్మి మబ్బు కరుణాకర్ ఎర్ర కుమార్ నల్ల రాహుల్ గట్టగల శ్రీహరి గాదపాక విష్ణు నల్ల కుమార్ నల్ల విజయ్ కంతి భాస్కర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా..?




తొలిఅడుగు,పరిమితికి మించి ఆదాయం పొందుతున్న వారందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. రాబడి వచ్చే వ్యక్తులు, కంపెనీలు, సంఘాలు.. ఇలా అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఏడాదిలో సంపాదించిన ఆదాయ వివరాలు తెలియజేస్తూ ఆదాయపు పన్ను శాఖకు ఐటీఆర్ (ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్) దాఖలు చేయాలి. ఆ శాఖ అధికారులు దాన్ని పరిశీలించి, మీ కట్టాల్సిన పన్నును నిర్ధారణ చేస్తారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఐటీఆర్ ను జూలై 31లోగా సమర్పించాలి. దీని కోసం ఐటీఆర్ 1 నుంచి 7 వరకూ వివిధ రకాల ఫారాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎవరు ఏ ఐటీఆర్ ఫారం సమర్పించాలో ఇప్పుడు తెలుసుకుందాం. మన దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఏడు రకాల ఐటీఆర్ ఫారాలను ఆదాయపు శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యక్తుల నుంచి కంపెనీల వరకూ కేటగిరీల వారీగా వీటిని వినియోగించాలి. ముఖ్యంగా తాము ఏ ఫారం సమర్పించాలో చెల్లింపుదారులకు తెలియాలి. దీని వల్ల సకాలంలో ఐటీఆర్ దాఖలు చేయడంతో పాటు, తిరస్కరణకు గురయ్యే ప్రమాదం తప్పుతుంది. జీతం పొందే ఉద్యోగులు, ఫీలాన్సర్లు, నిపుణులు తమ ఆదాయానికి అనుగుణంగా పన్ను కట్టాలి. వీరిని జనరల్, సీనియర్ (60–80 ఏళ్లు), సూపర్ సీనియర్ (80 ఏళ్లకు పైగా)గా విభజించారు. వీరిలో రూ.50 లక్షల వరకూ జీతం రూపంలో ఆదాయం పొందే వారు ఐటీఆర్–1 (సహజ్), మూలధన లాభాలు, బహుళ ఆస్తులున్న వారు ఐటీఆర్–2, వ్యాపారం, ప్రొఫెషన్ నుంచి ఆదాయం వచ్చే వారు ఐటీఆర్–3, అలాగే సెక్షన్లు 44ఏడీ, 44ఏడీఏ, 44 ఏఈ కింద ఊహాజనిత ఆదాయం కోసం ఐటీఆర్–4 (సుగమ్)ను దాఖలు చేయాలి. హెచ్‌యూఎఫ్ అంటే అవిభక్త కుటుంబం అని అర్థం. దీన్ని చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. ఒక హిందూ వ్యక్తి పెళ్లిచేసుకున్నప్పుడు అతడి కుటుంబం దీనికి కిందకు వస్తుంది. హిందువులతో పాటు జైనులు, సిక్కులు, బౌద్ధులు కూడా హెచ్ యూఎఫ్ లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి పూర్వీకులతో కలిసి ఉన్న కుటుంబ యూనిట్ అని చెప్పవచ్చు. వీరు తమ ఆదాయ వనరులను బట్టి ఐటీఆర్–2, ఐటీఆర్–3, ఐటీఆర్–4 ఫారాలను సమర్పించాలి.

# ఈ టాటా నుంచి మరో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్..




తొలిఅడుగు, కొత్త ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ కోసం బుకింగ్‌లు వచ్చే నెల జూన్ 2 నుండి ప్రారంభమవుతాయి. అయితే వాహనం డెలివరీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై కంపెనీ ఇంకా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ లాంచ్ అయింది. ఈ వాహనం 2020 లో కస్టమర్ల కోసం ప్రారంభించింది. ఇప్పుడు ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ దాని మొదటి ప్రధాన అప్‌డేట్‌తో వస్తోంది. కొత్త ఆల్ట్రోజ్ కొత్త డిజైన్, కొత్త ఫీచర్లతో ప్రారంభించింది. ఈ కారులో స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, అకంప్లిష్డ్ ఎస్ మరియు అకంప్లిష్డ్ ప్లస్ ఎస్ అనే ఐదు వేరియంట్లు విడుదలయ్యాయి. భద్రత కోసం టాటా మోటార్స్ నుండి వచ్చిన ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లో 6 ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, సీట్ బెల్ట్ రిమైండర్‌తో కూడిన 3 పాయింట్ల జుూ= వంటి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. దీనితో పాటు, ఈ కారులో స్మార్ట్ డిజిటల్ స్టీరింగ్ వీల్, రిమోట్ కీలెస్ ఎంట్రీ, ఆల్ డోర్ పవర్ విండోస్, మల్టీ డ్రైవ్ మోడ్‌లు, ఐడిల్ స్టార్ట్/స్టాప్ వంటి ఫీచర్లను కంపెనీ అందించింది. 12.8 సెకన్లలో 0 నుండి 100 కి వేగవంతం అయ్యే కొత్త టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ మోడల్, 200 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేసే 1.2-లీటర్ రెవోట్రాన్ పెట్రోల్ ఇంజిన్‌తో శక్తిని పొందుతుంది. ఈ కారును 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఆటోమేటిక్ 6 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో కొనుగోలు చేయవచ్చు. 5 రంగుల ఎంపికలలో ప్రారంభించిన కొత్త టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో 345 లీటర్ల బూట్ స్పేస్ ఉంటుంది. అయితే జుూ+ వేరియంట్ 210 లీటర్ల బూట్ స్పేస్ కలిగి ఉంటుంది. ఇప్పుడు ఆల్ట్రోజ్ కొత్త ఫ్రంట్ గ్రిల్, కొత్త ఫ్రంట్ బంపర్, డ్యూయల్ టోన్ 16 అంగుళాల అల్లాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్ (సెగ్మెంట్‌లో మొదటిది) తో అందుబాటులో ఉంటుంది. ఈ కారులో జంట 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, నావిగేషన్ మ్యాప్ వ్యూతో కూడిన డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంటాయి.

# ఆర్‌సీబీకి బిగ్ షాకింగ్ న్యూస్..




తొలిఅడుగు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును 42 పరుగుల తేడాతో ఓడించి అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 231 పరుగులు చేసింది. దీనికి ప్రతిస్పందనగా బెంగళూరు కేవలం 189 పరుగులకు ఆలౌట్ అయింది. ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఒక షాకింగ్ న్యూస్ వచ్చింది. జట్టులోని కీలక బ్యాట్స్‌మెన్లలో ఒకరైన టిమ్ డేవిడ్‌కు గాయం అయినట్లు తెలుస్తోంది. ప్లేఆఫ్స్ కీలక మ్యాచ్‌లు సమీపిస్తున్న తరుణంలో ఈ గాయం వార్త ఆర్సీబీ శిబిరంలో ఆందోళన కలిగిస్తోంది. టిమ్ డేవిడ్, తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో ఆర్సీబీకి ఎన్నో కీలక విజయాలను అందించాడు. డెత్ ఓవర్లలో అతను చేసే తుఫాన్ బ్యాటింగ్ జట్టు స్కోరును భారీగా పెంచడంలో కీలక పాత్ర పోషించింది. అలాంటి కీలక ఆటగాడు గాయం బారిన పడటం జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా పరిగణించవచ్చు. గాయం తీవ్రతపై ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన రాలేదు. అయితే, అతను ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా స్పష్టంగా తెలియదు. ఒకవేళ టిమ్ డేవిడ్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు దూరమైతే, అతని స్థానంలో ఏ ఆటగాడిని తీసుకుంటారు అనేది ఆర్సీబీ మేనేజ్‌మెంట్‌కు పెద్ద సవాలుగా మారనుంది. ఈ సీజన్‌లో ఆర్సీబీ అద్భుతమైన ప్రదర్శనతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ (అతని గాయం నుంచి కోలుకుంటే), ఇతర విదేశీ ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. అయితే, టిమ్ డేవిడ్ లేని లోటు జట్టు బ్యాలెన్స్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా లోయర్ ఆర్డర్‌లో అతను చేసే దూకుడు బ్యాటింగ్, ఫినిషర్‌గా అతని పాత్ర చాలా కీలకం. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు అత్యంత ఒత్తిడితో కూడినవి. ఇలాంటి సమయంలో ఒక కీలక ఆటగాడు గాయపడటం జట్టు ప్రణాళికలను మార్చాల్సి వస్తుంది. టిమ్ డేవిడ్ గాయం తీవ్రతపై త్వరలో స్పష్టత వస్తుందని, అతను ప్లేఆఫ్స్ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండాలని ఆర్సీబీ అభిమానులు ఆశిస్తున్నారు. అతని ఫిట్‌నెస్ గురించి పూర్తి వివరాలు తెలిసే వరకు ఆర్సీబీ అభిమానుల్లో ఆందోళన కొనసాగే అవకాశం ఉంది.

# ఫాస్టెస్ట్ సెంచరీతో ఇంగ్లీషోళ్లనే గజగజ వణికించేశాడుగా..



తొలిఅడుగు, ఈ మ్యాచ్‌లో బెన్నెట్ ప్రదర్శన అతని కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అతని రెండవ శతకం. అలాగే ఇదే అతని అత్యధిక స్కోరుగా నిలిచింది. అతని ఈ ఫియర్ లెస్ బ్యాటింగ్, జింబాబ్వే క్రికెట్‌కు ఒక ఆశాకిరణంలా నిలిచింది. క్రికెట్ ప్రపంచంలో ఓ జింబాబ్వే ప్లేయర్ సంచలనం సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే యువ బ్యాటర్ బ్రయాన్ బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్‌తో 139 పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో బెన్నెట్ చూపిన ప్రతిభ, అతని దేశానికి ఒక గొప్ప గుర్తింపును తెచ్చింది. ఇంగ్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 565 పరుగుల భారీ స్కోరును డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన జింబాబ్వేకు బ్యాటింగ్ సవాలుగా మారింది. ఈ సమయంలో, బ్రయాన్ బెన్నెట్ క్రీజ్‌లోకి వచ్చి ధైర్యంగా, దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అతను కేవలం 143 బంతుల్లో 139 పరుగులు సాధించాడు. ఇందులో 26 ఫోర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ స్ట్రైక్ రేట్ 97.20గా ఉండటం విశేషం. ఇది టెస్ట్ క్రికెట్‌లో జింబాబ్వే బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన శతకం (97 బంతుల్లో సెంచరీ)గా మారింది.అతను తన ఇన్నింగ్స్‌లో పలు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (42)తో కలిసి 65 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత సీన్ విలియమ్స్ (25)తో కలిసి 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ పరుగులు జింబాబ్వే ఇన్నింగ్స్‌కు ఒక మంచి పునాది వేశాయి. అయితే, బెన్నెట్ అద్భుత ఇన్నింగ్స్ ఆడినప్పటికీ, జింబాబ్వే జట్టు 265 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జింబాబ్వేను ఫాలో ఆన్ ఆడిస్తోంది. రెండవ ఇన్నింగ్స్‌లో బెన్నెట్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఈ మ్యాచ్‌లో బెన్నెట్ ప్రదర్శన అతని కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అతని రెండవ శతకం. అలాగే ఇదే అతని అత్యధిక స్కోరుగా నిలిచింది. అతని ఈ ఫియర్ లెస్ బ్యాటింగ్, జింబాబ్వే క్రికెట్‌కు ఒక ఆశాకిరణంలా నిలిచింది. బ్రయాన్ బెన్నెట్ భవిష్యత్తులో జింబాబ్వే క్రికెట్‌లో ఒక కీలక ఆటగాడిగా మారతాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

# వారి లోటును పూడ్చడం కష్టమే




తొలిఅడుగు, సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల స్థానాలను భర్తీ చేయడం అనుకున్నంత తేలికేం కాదని టీమిండియా ప్రధాన కోచ్ గౌతం గంభీర్ స్పష్టం చేశాడు. ప్రపంచ క్రికెట్‌లోనే రోహిత్, విరాట్‌లు అసాధారణ ఆటగాళ్లు అని కొనియాడాడు. వీరిద్దరూ ఏకకాలంలో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం జట్టుపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నాడు. అయితే ఏ ఆటగాడికైనా ఏదో ఒక సమయంలో ఆట నుంచి తప్పుకోవాల్సి ఉంటుందన్నాడు. కోహ్లి, రోహిత్‌లను రిటైర్మెంట్ నిర్ణయం మార్చుకోమని ఎవరూ కూడా చెప్పలేరన్నాడు. ఇది వారి వ్యక్తిగత నిర్ణయమన్నారు. ఇక భారత క్రికెట్‌పై వీరిద్దరూ తమదైన ముద్ర వేశారన్నాడు. వీరి లేని లోటు జట్టుపై స్పష్టంగా కనపడుతుందన్నాడు. కానీ ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లతో కూడిన భారత క్రికెట్ దీని నుంచి త్వరలోనే బయటపడుతుందనే నమ్మకాన్ని గంభీర్ వ్యక్తం చేశాడు. భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదన్నాడు. గతంలో కూడా పలువురు సీనియర్ ఆటగాళ్లు రిటైర్మెంట్ ప్రకటించినప్పుడూ స్వల్ప వ్యవధిలో భారత బ్యాటింగ్ పుంజుకున్న విషయాన్ని గుర్తు చేశాడు. ఈసారి కూడా యువ ఆటగాళ్లు వీరి లోటును పూడ్చడం ఖాయమన్నాడు. అయితే ఇది అనుకున్నంత సులువు కాదని గంభీర్ అభిప్రాయపడ్డాడు. రానున్న ఇంగ్లండ్ సిరీస్ తమకు సవాల్ వంటిదేనన్నాడు. కీలక ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతుండడంతో జట్టు కాస్త ఒత్తిడిలో ఉన్న విషయం వాస్తవమేనన్నాడు.

# సత్తా చాటిన హార్దిక్ పాండ్య



తొలిఅడుగు, కిందటి ఐపిఎల్ సీజన్‌లో హార్దిక్ పాండ్య సారథ్యంలోని ముంబై ఇండియన్స్ అత్యంత పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచిన సంగతి తెలిసిందే. అద్భుత కెప్టెన్సీతో గుజరాత్ టైటాన్స్‌కు ఐపిఎల్ ట్రోఫీ సాధించి పెట్టిన హార్దిక్‌ను ముంబై ఇండియన్స్ అనూహ్య రీతిలో సొంతం చేసుకుంది. అతన్ని జట్టులోకి తీసుకోవడమే కాకుండా రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. కానీ గుజరాత్‌ను ముందుండి నడిపించిన హార్దిక్ ముంబై కెప్టెన్‌గా మాత్రం పూర్తిగా తేలిపోయాడు. సీజన్ 2024లో ముంబై చెత్త ప్రదర్శనతో నిరాశ పరిచింది. దీంతో హార్దిక్ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తాయి. అతన్ని తప్పించి రోహిత్ శర్మ లేదా సూర్యకుమార్ యాదవ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ ఊపందుకుంది. కానీ ముంబై యాజమాన్యం మాత్రం హార్దిక్‌పైనే నమ్మకాన్ని ఉంచింది. సీజన్ 2025లో మళ్లీ హార్దిక్‌కే సారథ్యం అప్పగించింది. మరోవైపు హార్దిక్ సారథ్యంలో బరిలోకి దిగిన ముంబై ఆరంభ మ్యాచుల్లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచింది. వరుస ఓటములతో సతమతమైంది. దీంతో మరోసారి హార్దిక్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్ని విమర్శలు వచ్చినా హార్దిక్ ఒత్తిడికి గురికాలేదు. తన పని తాను చేసుకుంటూ ముందుకు పోయాడు. సీనియర్లు రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్‌ల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాడు. అసాధారణ కెప్టెన్సీతో జట్టులో కొత్త జోష్‌ను నింపాడు. సహచరుల్లో ఎప్పటికప్పుడూ ఉత్సాహాన్ని నింపుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఒక దశలో ప్లేఆఫ్ మాట అటుంచి కనీసం టాప్8లోనైనా నిలుస్తుందా లేదా అని భావించిన ముంబైని ఏకంగా టాప్4లో నిలిపి విమర్శకులు నోళ్లను మూయించాడు. ముంబై ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిందంటే దానికి ప్రధాన కారణం హార్దిక్ సారథ్య నైపుణ్యమే కారణమని చెప్పాలి. కెప్టెన్‌గా, ఆటగాడిగా జట్టును ముందుండి నడపించాడు. సహచరులు శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రజత్ పటిదార్‌ల మాదిరిగానే తన జట్టును ప్లేఆఫ్‌కు చేర్చి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ప్రస్తుతం ముంబై ఆటను గమనిస్తే మరోసారి ఐపిఎల్ ట్రోఫీని సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగా ఉన్న ముంబైకి హార్దిక్ అద్భుత కెప్టెన్సీ తోడు కావడంతో ముంబై టైటిల్ ఫేవరెట్‌గా మారింది.

# సెమీస్‌లో శ్రీకాంత్
## క్వార్టర్‌ఫైనల్లో ఉత్కంఠ విజయం



తొలిఅడుగు, భారత వెటరన్ షట్లర్, పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2023 తర్వాత తొలిసారి ఓ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ ఏడాది థారులాండ్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్న శ్రీకాంత్.. 2023లో స్విస్, మకావు ఓపెన్‌లో సెమీస్‌కు చేరుకున్నాడు. కౌలాలంపూర్ స్పోర్ట్స్ సిటీలో జరుగుతున్న మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో మెరిసిన శ్రీకాంత్ మళ్లీ సెమీఫైనల్లో కాలుమోపాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ ఆటగాడు టోమ జూనియర్‌పై మూడు గేముల మ్యాచ్‌లో శ్రీకాంత్ గెలుపొందాడు. 74 నిమిషాల పాటు ఉత్కంఠ సాగిన మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 24-22, 17-21, 22-20తో పైచేయి సాధించాడు. గతంలో రెండు సార్లు టోమ చేతిలో ఓడిన శ్రీకాంత్.. మలేషియా మాస్టర్స్‌లో అతడికే చుక్కలు చూపించాడు. తొలి గేమ్‌లో 10-11తో విరామ సమయానికి ఓ పాయింట్ వెనుకంజ వేసిన శ్రీకాంత్ ద్వితీయార్థంలో పుంజుకున్నాడు. ప్రతి పాయింట్‌కు ఆధిక్యం చేతులు మారిన మ్యాచ్‌లో 22-22 వరకు నువ్వా నేనా అన్నట్టు సాగింది. ఆఖర్లో వరుసగా రెండు పాయింట్లు సాధించిన శ్రీకాంత్ తొలి గేమ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెండో గేమ్‌ను టోమ 21-17తో గెల్చుకుని లెక్క సమం చేశాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ సైతం ఉత్కంఠ రేపింది. విరామ సమయానికి 7-11తో తడబాటుకు గురైన శ్రీకాంత్.. ఆ తర్వాత గొప్పగా పుంజుకున్నాడు.